క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



సన్మానిస్తున్న జగదీశ్వర్ తదితరులు

తిమ్మాపూర్: ఎస్సారెస్పీ కార్యాలయంలో విధులు నిర్వహించి ఇటీవల విరమణ పొందిన సూపరింటెండెంట్ మహ్మద్ మసూద్ అలీ, ఆఫీస్ సబార్డినేట్ గంగిపెల్లి మల్లయ్యను టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ సన్మానించారు. ఎల్ఎండీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి జగదీశ్వర్ హాజరై రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ రావు, ఒంటెల రవీందర్‌రెడ్డి, గంగారపు రమేశ్, సర్దార్ హర్మిందర్‌సింగ్, కోట రామస్వామి, పోలు కిషన్, బుర్ర రాజయ్యగౌడ్, జయేందర్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు..

రామడుగు: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను శనివారం జిల్లాపరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు శుక్రుద్దీన్, మాజీ సర్పంచ్ కాడె శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబు, డి.శంకర్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు



రామడుగు: వృద్ధురాలికి చేయూతనందించి అనాథ ఆశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు రామడుగు పోలీసులు. వెదిర గ్రామానికి చెందిన కుమ్మరి దుర్గమ్మ(65) అనే వృద్ధురాలు ముగ్గురు కూతుళ్లున్నా పట్టించుకోవడం లేదని రామడుగు పోలీసులను శనివారం ఆశ్రయించింది. ఆమె భర్త నర్సయ్య మృతిచెందడంతోపాటు కొడుకు శ్రీనివాస్ కూడా అనారోగ్యంతో మృతిచెందాడని తెలుసుకున్న రామడుగు ఎస్సై వి.శేఖర్ వృద్ధురాలిని స్పందన యువసేన సేవాసంస్థ ఆశ్రమంలో చేర్పించారు.

పిల్లల ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలోని వాత్సల్య పిల్లల హాస్పిటల్‌లో వారం రోజుల క్రితం జరిగిన సంఘటనపై జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు లాభార్జనే ధ్యేయంగా అధికంగా ఓపీ ఫీజులు వసులు చేస్తున్నారని ఆరోపించారు. టెస్టులు, మెడిసిన్స్ ఇష్టారాజ్యంగా రాస్తూ పేద ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

గ్యాస్ స్టవ్ అందజేత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమానికి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గ్యాస్ స్టవ్‌ను అందజేసినట్లు నిర్వాహకుడు వీరస్వామి శనివారం తెలిపారు. కొంతకాలంగా వంట చేసేందుకు ఉపయోగించే గ్యాస్ స్టవ్ పాడై ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో రూ.2,500 విలువ చేసే గ్యాస్ స్టవ్‌ను అందజేశారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

సైదాపూర్: గొడిశాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జున్నూతుల అరుణాదేవి శనివారం పాఠశాలకు రూ.20వేల విలువైన మైక్ సెట్ బహూకరించారు. గొడిశాల గ్రామానికి ఒకప్పుడు సర్పంచ్‌గా పని చేసిన అరుణాదేవి భర్త జున్నూతుల నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం పాఠశాలకు మైక్ సెట్ బహూకరించారు. హెచ్ఎం పాన్యానాయక్, స్కూల్ చైర్మన్ మోతుకు రజిత, ఉపాధ్యాయులున్నారు.

గన్నేరువరంలో పశు వైద్యశిబిరం



పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

గన్నేరువరం: గన్నేరువరంలో శనివారం పశు వైద్యాధికారులు పశు వైద్యశిబిరం నిర్వహించారు. 300 ఆవులు, గేదెలకు గాలికుంటు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి సురేందర్ రెడ్డి తెలిపారు. జూనియర్ వెటర్నరీ అధికారి అభిషేక్‌రెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ విజయభాస్కర్, సబార్డినేటర్లు దేవరాజ్, అజయ్, గోపాలమిత్ర సాగర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి దమ్మక్కపేట గ్రామ సమీపంలోని శ్మశాన వాటికకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా వ్యవసాయ బావి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ దారి వెంట వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు జంకుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ప్రమాదం జరగకముందే బావి చుట్టూ రక్షణ కోసం ఫెన్సింగ్ లేదా గోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయానికి విరాళం



చొప్పదండి: పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన గుర్రం మణిందర్‌రెడ్డి రూ.10,116 విరాళం అందించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు గుర్రం సంజీవరెడ్డి, శారద కుమారుడైన మణిందర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడగా.. మొదటి నెల జీతం నుంచి ఆలయ అభివృద్ధికి విరాళం అందించినట్లు ఆలయ నిర్వాహకుడు సింహాచలం జగన్‌మోహన్‌స్వామి తెలిపారు. పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం ఆనందరెడ్డి, గుర్రం చంద్రారెడ్డి, పూజారి భాష్యం నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ షరీఫ్ వేడుకలు



జమ్మికుంట: పట్టణంలోని పాత వ్యసాయ మార్కెట్ సమీపంలో జెండా గద్దె వద్ద ముస్లింలు గ్యార్మీ షరీఫ్(జెండా పండుగ) శనివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ముస్లింల అతి పవిత్రమైన మాసం రబ్బి ఉల్ సానిలో ఎంతో పవిత్రంగా జరుపుకునే గ్యార్మీ షరీఫ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ముందుగా ఫాతేహాఖ్వాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జెండా ఊరేగింపు చేసి హజ్రత్ గౌసి అజమ్ దస్తగిర్ రహ్మాతుల్లాహ్ అలై జెండా గద్దె వరకు వెళ్లి భక్తిశ్రద్ధలతో అల్లాహ్ కీర్తనలతో జెండాను ప్రతిష్ఠించారు.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు
- దారుల వెంట ఏపుగా ముళ్లపొదలు, చెట్లు



హుజూరాబాద్‌లోని కళాశాల వద్ద ప్రమాదకరంగా మలుపు

హుజూరాబాద్‌రూరల్: ఉత్తర తెలంగాణకు ఈ రహదారి ఎంతో కీలకమైంది. వరంగల్ నుంచి కరీంనగర్, రామగుండం వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదే. నిత్యం ఈ రోడ్డు గుండా వేల సంఖ్యలో వాహనాలు ప్రయణిస్తుంటాయి. చదువులు, వ్యాపారాలు, ఉద్యోగాలు ఇలా రకరకాల కారణాలతో ఈ రహదారి గుండా వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఒకప్పుడు సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డు తర్వాత డబుల్ రోడ్డుగా మారింది. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇప్పుడు ఇదే రహదారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న నాలుగు వరసల రహదారి పనుల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జనవరి మాసం నుంచి ఇప్పటివరకు రహదారుల్లో జరిగిన ప్రమాదాల్లో నియోజకవర్గ పరిధిలో ఎన్‌హెచ్ 563 రోడ్డులో 17 మంది మృతిచెందగా.. 19 మందికి తీవ్ర గాయాలు, 22 మందికి స్వల్ప గాయాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

ప్రమాదాలకు నిలయం..

ఈ రహదారిపై ఉన్న మలుపుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాల వద్ద ఉన్న మలుపు అతి ప్రమాదకరంగా ఉంది. దీనికితోడు ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో అని ప్రయాణికుల భయాందోళన చెందుతున్నారు. గతంలో అనేక సార్లు రాత్రిపూట ఈ మలుపు కనిపించక వాహనాలు కళాశాల గోడ ధ్వంసం చేసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. అధికారులు, నాయకులు దృష్టి పెట్టకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలామంది వీఐపీలు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తారు. అయినా ఈ మలుపు పరిస్థితి బాగుపడడం లేదు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని, మలుపుల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఏపుగా చెట్లు..

నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు, పట్టణం నుంచి కనుకులగిద్దె వచ్చే ధర్మరాజుపల్లె గ్రామాల మధ్య అనేక మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పలనర్సింగాపూర్ నుంచి కాట్రపల్లికి వచ్చే మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గణేశ్‌నగర్ నుంచి వీణవంకకు, సిర్సపల్లి నుంచి జమ్మికుంటకు, బోర్నపల్లి నుంచి సైదాపూర్‌కు, జమ్మికుంట నుంచి ఇల్లందకుంటకు వెళ్లే దారిలో సైతం ప్రమాదకరమైన మలుపులున్నాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతోపాటు రోడ్ల వెంట చెట్లు, ముళ్లపొదలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

భయంభయంగా ప్రయాణం



పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద మలుపుతో గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. 15 సంవత్సరాలుగా సింగాపూర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నా. విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కళాశాల మలుపు వద్ద భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం కూడా ప్రమాదమే. ప్రమాదం జరగకుండా రోడ్డు నిర్మించాలి.

– పెద్ది రాంరెడ్డి, అధ్యాపకుడు, హుజూరాబాద్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని మలుపు రోడ్డులో ప్రమాద సూచికలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే స్థానిక గ్రామ పంచాయతీల సిబ్బందితో ఆయా గ్రామాల్లో అంతర్గత రోడ్ల పక్కన ఉన్న చెట్ల పొదలను తొలగించాం. మా దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని పరిశీలించి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలను చేపట్టడంతోపాటు రక్షణ చర్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– బాపిరెడ్డి, ఇన్‌చార్జి డీఈ, ఆర్‌అండ్‌బీ

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



నిత్యం రద్దీగా ఉండే కరీంనగర్ నుంచి వరంగల్ రోడ్డులో ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే రానున్న రోజుల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడొచ్చు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మలుపు వద్ద వెంటనే రేడియంతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డును ఏర్పాటు చేయాలి.

– వేముల గోవర్ధన్, ప్రయాణికుడు, హుజూరాబాద్



సైదాపూర్: సైదాపూర్‌లో రోడ్లపై వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధాన రోడ్ల వెంట వైన్స్ దుకాణాలు, టీ పాయింట్లు, హోటళ్లుండడంతో వాహనాలు నిలుపుతున్నారు. ఇతర వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బస్టాండ్ ఏరియాలో బ్యాంకులు, ఎదురుగా హోటల్ ఉండడంతో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నారు. బస్టాండ్లోకి బస్సులు వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సీహెచ్ తిరుపతి, ఎస్ఐ, సైదాపూర్, సెల్ నం.8712670775

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

'అసభ్య మాటలు, చిల్లర రాజకీయాలు మానుకో'



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

కరీంనగర్: అసభ్య పదజాలంతో దూషించడం, మీ అనుచరులతో బూతు పురాణంతో విమర్శించడం, భౌతిక దాడులకు పాల్పడతామని హెచ్చరించడం, అభివృద్ధి, హామీలపై ప్రజలు ప్రశ్నిస్తే బెదిరించడం వంటి చిల్లర రాజకీయాలు, కమీషన్ల వసూళ్ల దందాను ఇకనైనా బంద్ చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు హితవు పలికారు. పదేళ్లు మానకొండూర్ నియోజకవర్గానికి రూ.కోట్లు తెచ్చి అభివృద్ధి చేశానని, పది నెలల్లో ఒక్క పని కూడా చేయలేదని, కనీసం అసంపూర్తిగా ఉన్న రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. శనివారం కరీంనగర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికైనా మానకొండూర్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, నేను కూడా నీతో కలిసి వచ్చి మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నిధులు తెద్దామన్నారు. నాపై అసభ్య పదజాలంతో మీ అనుచరులతో తిట్టిస్తావా.. పదేళ్లలో ఒక్కటైనా అభివృద్ధి శిలాఫలకం వేశావా అంటూ ప్రశ్నించారు. కుటుంబం ఉందనే ఆలోచన మరిచి అసభ్య ఆరోపణలు చేయడం మానుకొని సరిగా పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. నువ్వు ఎక్కడ పోటీ చేసినా ఓడిస్తానని సవాల్ విసరారు. మా కార్యకర్తలపై దాడి చేస్తే ప్రతి దాడికి పూనుకుంటామన్నారు. మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో అధికారులు, నాయకులు

హుజూరాబాద్‌రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14 బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన కబడ్డీ జట్లు పాల్గొనగా.. ఆయా జట్ల నుంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా.. సిరిసిల్ల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో సిరిసిల్ల జట్టు ప్రథమ స్థానంలో నిలవగా.. కరీంనగర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ క్రీడాకారుల ఎంపిక కోసం 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకుడు వేముల రవి కుమార్ తెలిపారు. మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్, హాకీ క్లబ్ రాష్ట్ర నాయకుడు బండ శ్రీనివాస్, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, హాకీ క్లబ్ రాష్ట్ర నాయకుడు తోట రాజేంద్రప్రసాద్, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం తిరుమల, కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రావుల వేణు, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, హాకీ క్లబ్ ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్, కార్యదర్శి గనిసెట్టి ఉమామహేశ్వర్, గుద్దేలుగుల సమ్మయ్య, పీడీ చిరుత శ్రీనివాస్, పీఈటీ సొల్లు అనిల్, కోచ్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయన్న ఫౌండేషన్ అధినేత గుడిపాటి జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గుడిపాటి సరిత ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. 98 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అరుకాల వీరేశలింగం, ఇమ్మడి దయాకర్, పోలంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కె.వెంకన్న, ఇంద్రారెడ్డి, పిట్టల మొగిళి, మునిగాల మధు, మిడిదొడ్డి అమర్, అప్పాల రఘుపతి, వేల్పుల రత్నం, వేల్పుల ప్రభాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి భరోసా



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్‌లో పని చేసే ప్రతి పారిశుధ్య కార్మికుడు బీమా చేసుకోవాలని, బీమాతో ఆ కుటుంబానికి భరోసా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ అయాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు బీమా స్కీమ్స్‌పై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికుడు బాగుంటేనే మున్సిపల్ బాగుంటుందన్నారు. స్టేట్ యూనిసెఫ్ సభ్యుడు ఫణింద్రకుమార్, జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ కిషన్ స్వామి, కోఆర్డినేటర్ రవీందర్, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మహేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, మాతంగి నరేశ్, జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం 4వేలు పూర్తి



చిగురుమామిడిలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో 4వేల సభ్యత్వాలు పూర్తి చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు జరగని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. మండల ఉపాధ్యక్షుడు కంది శంకర్, అచ్చ రవీందర్, గర్షాస్ సతీశ్, గొల్లపల్లి సదాచారి, చంద్రశేఖర్‌రెడ్డి, బరిగెల మోహన్, ముదిగిరి రాజు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: రామడుగులో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బూత్ నంబర్ 85లో సభ్యత్వాలు సేకరించారు. నాయకులు రాగం కనకయ్య, మాడిశెట్టి జయంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం



మాదాపూర్‌లో ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గన్నేరువరం: కరీంనగర్ నుంచి వయా గుండ్లపల్లి, జంగపల్లి, మాదాపూర్, గన్నేరువరం వరకు ఆర్టీసీ బస్సును శనివారం ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. సంబంధిత బస్సుకు మాదాపూర్ గ్రామంలో ప్రజలు స్వాగతం పలికారు. ఈ మార్గంలో ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ బస్సును ప్రవేశపెట్టాలని కోరుతూ పలు సందర్భాల్లో మాదాపూర్‌తోపాటు ఇతర గ్రామస్తులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బస్సును ప్రారంభించడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, మాజీ సర్పంచులు కుమ్మరి సంపత్, రామచందర్‌రావు, భూమయ్య, సంపతి శ్రీనివాస్, మానవాడ జోషి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయాలి



రామంచలో మాట్లాడుతున్న శంకర్

చిగురుమామిడి: రామంచ గ్రామంలో మాస్టిన్ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు దర్శనం శంకర్ కోరారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మాస్టిన్ కులస్తులు ఉండటానికి ఇల్లు లేదని, ఇంటి నిర్మాణం కోసం స్థలాల్లేవన్నారు. ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలందించి తమ కుటుంబాలను ఆదుకోవాలనే అంశాలపై తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. తెలంగాణ మాస్టిన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నాగిల్ల నర్సయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల గంగ నర్సయ్య, నాయకులు నాకెళ్ళ బాబురావు, బుద్దుల రమేశ్, కిష్టయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని మాస్టిన్ కులస్తులు హాజరవ్వాలని కోరారు.

మాలల ఐక్యత సదస్సుకు తరలిరావాలి

గన్నేరువరం: కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆదివారం జరిగే మాలల ఐక్యత సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాల మహానాడు నాయకుడు సొల్లు అజయ్‌వర్మ ఒక ప్రకటనలో కోరారు. వర్గీకరణ పేరుతో దళితులను విడదీయాలని ఎంతోమంది ప్రయత్నం చేస్తున్నారని, కాని మనమంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం కోసం దళితులంతా ఏకం కావాలన్నారు. ఇందులో భాగంగా ప్రతీ ఒక్కరు హాజరవ్వాలని కోరారు.